# నేను = నువ్వు = అతను

**"హితశ్రీ"**

హిమాలయాల నించి దిగి వచ్చి సిద్ధుడూ సింహాద్రీ కాలినడకతో భారతదేశంలో సంచారం చేస్తున్నారు. సిద్ధుడు సంకల్ప సిద్ధుడు. సర్వ విషయాలూ సాంగోపాంగంగా ఎరిగినవాడు. సింహాద్రి అతని నమ్మిన మిత్రుడు, తోడు నీడ, సహవాసి.

సహజసంపద ఐన ప్రకృతి సౌందర్యాన్ని విస్ఫారిత నేత్రాలతో అవలోకిస్తూ కాలి నడకన సంచరిస్తున్న సిద్ధుడూ, సింహాద్రీ ఒక నదీ తీరానికి చేరుకున్నారు. తీరాన గల ఒక గుడిలో బస ఏర్పాటు చేసుకున్నారు. అన్నం వండుకుని భోజనం చేసి మళ్ళీ బయలుదేరాలి. సింహాద్రి సరదాగల మనిషి. ఈలోగా చుట్టుపక్కల ఉన్న అడవిలోకి వెళ్ళిరావాలని పించిందతనికి. సింహాద్రి తత్వం తెలిసిన సిద్ధుడు "సరే" నన్నాడు.

సరదాగా తిరగటానికి వెడితే సింహాద్రి యెప్పుడూ ఊరికే తిరిగిరాడు. వింత విషయం ఏదో తెలుసుకు తీరాలి. పరుగుపరుగున వస్తున్న సింహాద్రిని చూసి ఏదో విశేషం ఉందని అప్పుడే అనుకున్నాడు సిద్ధుడు.

"గురువుగారూ"

"ఏమిటి?" అడిగాడు సిద్ధుడు చిరునవ్వుతో.

"ఒక చిన్న సందేహం."

"ఊం."

"అడవిలో ఓ చెట్టు బోదెమీద యెవరో కొన్ని అక్షరాలు చెక్కారు."

"అందులో కొత్తేముంది?"

"ఆ అక్షరాల అర్థం నాకు బోధపడలేదు."

"ఏమిటా అక్షరాలు?"

'నేను = నువ్వు = అతను.

ఇదే సూత్రం

విప్లవతత్వం'— ఈ వృత్తాంతం సవిస్తరంగా చెప్పండి."

సిద్ధుడు మందహాసం చేశాడు. సింహాద్రి శ్రద్ధగా చూస్తున్నాడు. తేజోవంతమైన కళ్ళని సిద్ధుడు ఆకాశం వైపుకి తిప్పాడు. ఆకళ్ళు ప్రసారంచేసే వెలుగువైపు చూస్తూ, సింహాద్రి ఊకొడుతుండగా సిద్ధుడు చెబుతున్నాడు.

(కథా ప్రారంభము)

"సింహాద్రీ, భారతదేశంలో ప్రబలంగా ఉన్న దుర్భరమైన ఆర్థికపరిస్థితి నీకు తెలుసు. కాలేకడుపుతో పనిచేస్తున్న గుమాస్తాకి ఉన్నట్టుండి బతుకుమీద ఏవగింపు కలిగింది. రాసే కలం బల్లమీద కొట్టి ఆఫీసునించి బయటపడి కాళ్లు తీసుకుపోయిన దారిని పోతున్నాడు. ఊరిబయటికొచ్చేశాడు. రోడ్డుపక్క పొలంలో పని చేస్తున్న రైతు అతన్ని చూశాడు.

"ఏమండీ ఇవాళ ఆఫీసు లేదా ఏమిటి?"

గుమాస్తా నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

"ఉంది."

"సెలవు పెట్టారా?"

"ఊహుం."

"అయితే మరి..."

"ఏమిటి?"

"ఇటు వెడుతున్నారెందుకు?" అనుమానంగా అడిగాడు రైతు.

"ఆఫీసుకి వెళ్లట మెందుకు?"

రైతుకు అర్థం కాలేదు.

"అంటే?"

"బతకటానికేనా?"

"అంతేగా, మరి"

"అది జరిగే పనిగా కనపడక పోతే?"

"మీరే అట్టా అంటే..."

"అందుకే ఇలా..."

"ఎక్కడికి?"

"ఎక్కడికో"

"అదేమిటి? మరి ఇంట్లో..."

"వొంట్లో సత్తువ ఉన్నదాకా ప్రయత్నించాను. అంతే"

గుమస్తా నిర్లక్ష్యంగా ముందుకు సాగిపోయాడు. రైతు ఆలోచనలో పడ్డాడు. నిశ్చయించుకున్నాడు. కాడి అక్కడ పారేశాడు.

"గుమాస్తాగారూ" గట్టిగా పిలిచాడు. గుమస్తా వెనక్కి తిరిగాడు. రైతు గబగబా నడిచాడు.

"ఎందుకు?"

"నేనూ వొస్తున్నా."

"ఎక్కడికి?"

"ఎక్కడికో."

"ఎందుకూ?"

"మీరెందుకూ?"

గుమాస్తా ఒక క్షణం రైతు ముఖంలోకి చూశాడు.

"అందుకేనా?"

"అవును."

ఇద్దరూ నడుస్తున్నారు. ఊరి కనుచూపు మేరదాకా వెళ్ళారు. ఒక గ్రామికుడు ఎండిన చెట్టును నరుకుతున్నాడు. రైతును పలకరించాడు.

"ఎక్కడికి?"

"ఏమో."

గ్రామికుడికి ఆశ్చర్యం వేసింది.

"అదేమిటి?" అడిగాడు.

"కాళ్లు ఎక్కడికి తీసుకుపోతే అక్కడికి"

ఏదో జరిగిందనుకున్నాడు గ్రామికుడు.

"ఏమిటీ వేదాంతం?"

"అంతకంటె చేసేదేముంది?"

"పొలం పోలే?"

"పొలంలో ఏముంది?"

"ఇట్టా మాట్లాడుతున్నావు, ఏమయిందేమిటి?"

"పెరుకింది మట్టేగా మనది. పొరపాటు, అదీ మనది కాదు" వినిపించుకోకుండా అన్నాడా రైతు.

"అయితే?"

"డొక్కలాడని కాడికి రెక్కలాడట మెందుకు?"

"ఇంటో వాళ్ళు?"

"ఉన్నన్నా ఒకటే, లేకపోయినా ఒకటే"

"మరి ఇటెందాకా?"

"ప్రాణం వుండేదాకా."

"ఆడ" గుమాస్తాని చూపిస్తూ అడిగాడు గ్రామికుడు.

"అంతే"

గ్రామికుడు ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటా ఆలోచన?" రైతు అడిగాడు.

గ్రామికుడు గొడ్డలి కింద పారేశాడు.

"పద"

ముగ్గురూ బయలుదేరారు. నడిచి నడిచి అడవి చేరుకున్నారు చీకటి పడ్డది. అందరికీ అమితంగా ఆకలేస్తోంది.

"డొక్కలు డోలు వాయిస్తున్నయ్" అన్నాడు రైతు.

"అవంతేలే" అన్నాడు గ్రామికుడు.

"మామూలేగా. అలిసిపోయి అవే ఊరుకుంటాయిలే" అన్నాడు గుమాస్తా.

"ఒక్క చెట్టుకీ కాయ కనపడదేం ఖర్మం?" ఆకుల సందుల్లోంచి పడుతున్న వెన్నెలలో కాయలకోసం గాలిస్తున్నాడు రైతు.

"ఇవన్నీ మనుషులకి పనికిరాని చెట్లు."

"అదుగో, ఆ చిటారుకొమ్మని ఏవో కాయ లున్నట్టున్నయ్" వెతికాడు గ్రామికుడు.

"ఆవెట్టా అందుతయ్?"

చెట్టు మొదలుచుట్టూ బొమ్మజెముడు పుట్ట! కాలుమోపి చెట్టెక్కటానికి వీల్లేదు.

"నాకో ఉపాయం తోస్తోంది." గుమాస్తా ఆలోచించాడు.

"ఏమిటది?"

"మనం ఒకళ్ళ బుజాలమీద ఒకళ్లు ఎక్కితే ఆ కాయల్ని అందుకోవచ్చు."

"చిన్నప్పుడు సర్కస్ ఫీట్లుగాని చేశావేమిటయ్యా?" రైతు నవ్వాడు.

"పైనించి పడితే కింద ముళ్ళ పొదలోకే. మరి బాగా ఆలోచించాలి".

"కానీండి, ఏంచేస్తాం? అడవిచెట్లమధ్య ఏ పొదచాటునో ఓ కాయలుకాసే చెట్టు కనిపిస్తే ఈ ఆకలిలో ముళ్ళూ, గిళ్ళూ అడ్డురావు. కూచోవయ్యా రైతూ."

రైతు కాళ్లు ముడుచుకుని కూచున్నాడు. అతని బుజాలమీద గ్రామికుడూ, గ్రామికుడి బుజాలమీద గుమాస్తా కూచున్నారు, రైతు నెమ్మదిగా నుంచున్నాడు. గ్రామికుడు అతని బుజాలమీద నుంచున్నాడు. గుమాస్తా అతని బుజాలమీద నుంచుని కొమ్మ అందుకున్నాడు.

ఇంత శ్రమపడ్డా అక్కడ ఉన్నవి నాలుగు కాయలే.

ముగ్గురూ మూడు కాయలు తీసుకున్నారు. నాలుగో కాయ దగ్గర పేచీ వచ్చింది. అది ఎవరు తీసుకోవట్టు? సహజంగా ఎవరు ఎక్కువ శ్రమ పడ్డారనే ప్రసక్తి వచ్చింది.

"ఇంత ఆలోచన అనవసరం. న్యాయ ప్రకారం అది నాకే రావాలి. పైనించి పడితే నాగతేమవుతుందో ఆలోచించారా? కింద ఉన్న వాళ్లు పడ్డా కాళ్లు విరగవు. ఏమంటారు? న్యాయమేనా?"

"గుమాస్తా గారూ, మీరు పడలేదంటే దానికి కారణం ఎవరు? నేను కాస్త, అట్టా, ఇట్టా అయితే మీరేమయి ఉండేవారు? కింద భుజాలమీద కాళ్లు మోపి నిలబట్టం అంటే మాటలనుకున్నారేమిటి? ఆ కాయ నాదే."

"మీరిద్దరూ తగ్గాల. భుజాలమీద ఇద్దర్నీ ఎక్కించుకు ఎముకలు విరగగొట్టుకున్న నాకే ఆ కాయ రావాల. ఎముకగూడు తొలిగితే నాగతేం కాను?"

"అసలు నేను లేకపోతే ఈ కాయలు కొయ్యటమే ఉండేది కాదుగా." గుమాస్తా ఒక పట్టాన కాయ వొదులుకోదల్చుకో లేదు.

"నేను లేకపోతే ఎట్టా కోసేవారేమిటి? అసలు కాయలు చూపించిందెవరు?"

"ఎక్కువ కష్టపడ్డది నేను" రైతుకి కోపం వొస్తోంది.

"జాగ్రత్తగా పట్టు నిలబెట్టింది నేను."

"ఎక్కువ సాహసం చేసింది నేను."

"ఇదిట్టా తెగేట్టు లేదులే" అన్నాడు రైతు కొంచెం దౌర్జన్యంగా.

"ఎట్టా తెగుద్దేమిటి?" శ్రామికుడు తీసిపోలేదు.

"పోట్లాట ఎందుకు? న్యాయం చెబుతాను వినండి. దీన్ని మూడు సమభాగాలు చేద్దాం."

"ఆమాత్రం తెలివి నాకు లేకపోలేదు. భాగాలు సమంగా ఎట్టా తెగుతయ్? ఆదాలోచించండి. మాటనంగానే సరా?"

"చూస్తావుగా" గుమాస్తా కాయ చేతిలోకి తీసుకున్నాడు. చేతుల్తో ఏవో కొలతలు వేశాడు. రైతుదగ్గిర బాకు తీసుకున్నాడు. కాయ మూడు భాగాలైంది.

"ఏం?"

"తస్సాదియ్యా, బలే సమంగా కోసేవయ్యా."

మూడుముక్కల బరువూ సుమారుగా తూచి రైతు ఆశ్చర్యపడ్డాడు.

"ఈ మాత్రం దానికి ఇంత రభసపడ్డాం. సరే, ఇక్కడెక్కడైనా నీళ్లు దొరుకుతాయేమో చూడాలి. ఇవి ఇప్పుడే తింటే దాహం వేస్తుంది."

"ఈ చెట్టెక్కి చూస్తాను."

రైతు దగ్గిరలో ఉన్న ఓ చెట్టెక్కి నాలుగు వైపులా పారచూశాడు. దూరంలో వెన్నెల్లో మెరుస్తూ వాగు ఒకటి కనిపించింది.

ముగ్గురూ వాగు చేరుకున్నారు. ఒడ్డు దగ్గిరగా పారే నీళ్ళంతా బురదగా ఉన్నాయి.

"మధ్యలో ఆ రాళ్ళదగ్గిర నీళ్లు స్వచ్ఛంగా ఉన్నాయి" అన్నాడు గుమాస్తా.

"మీకు ఈతొచ్చేమిటి?"

"రాదు. నీకు."

"ఊహుఁ."

"నాకొచ్చు" అన్నాడు శ్రామికుడు.

"మరి మాకు రెండు దొప్పల్తో నీళ్లు తెచ్చి పెడతావా?"

"తేవొచ్చు."

"రెండు దొప్పలు చెయ్యగలవా, రైతూ?"

"ఆదెంత పని."

క్షణాలమీద రైతు రెండు దొప్పలు చేశాడు ఏవో ఆకుల్తో.

శ్రామికుడు వెంటనే వెళ్లక సందేహించాడు.

"ఏమిటి సందేహిస్తున్నావు?"

"ఈడ మొసళ్లుంటయ్యేమో?"

"ఉండవులే."

"ఎట్టా తెల్సు?"

"ఆఁ. ఇక్క డెందుకుంటయ్?" ధీమాగా అన్నాడు రైతు.

"దిగేది నువ్వు కాదుగా."

"ఉండవయ్యా, అంటే."

"ఇక్కడ నీళ్లు లోతు లేవుగా ఇక్కడ ఉండవోయ్." గుమాస్తా హామీ ఇచ్చాడు.

"ఏమో."

"అయితే నువ్వనేదేమిటి?"

"ఇంత ధైర్యం చేసి, శ్రమ పడితే నాకేం వొస్తది?"

"నీ భావమేమిటో స్పష్టంగా చెప్పరాదు?"

"మీ ఇద్దరికీ నీళ్లు తెచ్చిపెడితే, ఆ రెండు ముక్కలూ నా కిస్తారా?"

"ఇద్దరికీ ఈత రాదనేగా నువ్విట్టా బేరం చెయ్యటం. సరే తీసుకో. పారెయ్యండి గుమాస్తాగారూ."

"ఊరికే ఇస్తున్నారేంటి?"

శ్రామికుడు ఆ రెండు ముక్కలూ తీసుకుని పంచ చివర కట్టి నీళ్లలోకి నడిచాడు, ఎగకట్టిన పంచతో. వాగు మధ్యదాకా వెళ్లి నీళ్లు ముంచుతుంటే పంచ ఓ రాయికి తగిలి, చీకి ఉన్న ఆ గుడ్డ చిరిగి, అందులో కట్టి ఉన్న కాయా, ముక్కలూ నీళ్ల పాలయాయి. వాటికోసం చేతులు చాచటం వ్యర్థం. ప్రవాహ వేగంతో అప్పుడే అవి చాలా దూరం కొట్టుకుపోయాయి. చేసేది లేక కొప్పెల్లో నీళ్లు ముంచుకుని శ్రామికుడు వొడ్డుకు చేరుకున్నాడు. నీళ్లు పడి పంచంతా తడిసి ముద్దయింది. అతని అవస్థ చూసి, రైతూ గుమస్తానవ్వుకున్నారు. "దురాశ దుఃఖానికి చేటు అని ఊరికే అన్నారా మన వాళ్లు?" గుమస్తా ఊరుకోలేక అన్నాడు. శ్రామికుడికి రోషం వొచ్చింది. తమ భాగాల్లో చెరికొస్తా వాళ్లు శ్రామికుడి 'కిచ్చారు. ఆకలి బాధ ఎక్కువగా ఉంటం వల్ల అతను మారు మాట్లాడకుండా ఆ ముక్కలు తీసుకున్నాడు. ముగ్గురూ తినబోతుండగా వెనకనించి ఓకర్కశమైన స్వరం వినిపించింది.

"ఈ కాయలు కోసిందెవరు?"

ముగ్గురూ ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశారు. ఒక పెద్ద గంభీరాకారుడు నిలబడి వున్నాడు.

"ఈ కాయలు కోసిందెవరు?" గంభీరంగా మళ్లీ అడిగాడు అతను అధికార స్వరంతో. ముగ్గురికీ మళ్ళీ ఓ సారి వొళ్లు జలదరించింది.

"ఈ అడవి ఎవరిదో తెలుసా?"

ఒక్కసారిగా ముగ్గురికీ రాక్షసుల కథలు జ్ఞాపకానికొచ్చాయి. మాట్లాడటానికి ఎవరికీ ధైర్యం చాలలేదు.

"మాట్లాడరేం? ఎవరయ్యా, నువ్వేనా?" రైతువైపు భీకరంగా చూశాడు అతను.

"కాదు" అప్రయత్నంగా అన్నాడు రైతు.

"ఎవరు, మరి?"

రైతు కళ్ళని గుమస్తా వైపు తిప్పాడు. గుమాస్తాకి ప్రాణం పైనే పోయింది. రైతు తనని అలా బయట పడేస్తాడని అతను ఏకోశానా అనుకోలేదు. నిజానికి కోసింది తనే అయినా, అది ముగ్గురి ప్రయత్నంవల్లా జరిగిందే కాని తన ఒక్కడివల్లా కాదు. అయినప్పుడు "ఏజన్సీ ఆఫీసర్ గారికి తెలిస్తే జరిమానా, జైలు శిక్షా పడాలి. మర్యాదగా అవి అక్కడ పడేసి వెళ్ళండి. ఇటువంటి పనెప్పుడూ చెయ్యకండి. చూస్తే మర్యాదస్తులల్లే ఉన్నారు."

ఆ వ్యక్తి కాయలతో సహా చెట్లలో కలిసిపోయ్యాడు. గుమాస్తా ప్రాణం కుదటపడ్డది. ఈ మాత్రం దానికి బయట పడ్డందుకు రైతుకి కొంచెం కష్టం వేసింది.

"మీరు నన్ను క్షమించాలి. ప్రయత్నపూర్వకంగా నేను మిమ్మల్ని బయట పెట్టలేదు. ఏమిటో అట్టా..."

"పరవాలేదులే, రైతూ. కాని జరిగిన సంగతులు చూస్తుంటే నాకో విషయం స్ఫురిస్తోంది."

"ఏమిటది?"

"మన కష్టాలకీ, దారిద్ర్యానికి కారణం ఎవరో కాదు. మనమే."

"అంటే?"

"మనమీద, మన తోటివాళ్ళమీద మనకున్న దృక్పథాలే మన అధోగతికి కారణం. పంచుకునే సమయంలో కాయలు కొయ్యటానికి నేను ఎక్కువ కారణమంటే నేను ఎక్కువ కారణమని పోట్లాడుకున్నాం. నిజానికి, ఆత్మపరీక్ష చేసుకుంటే, ఎవరూ ఎక్కువ కాదు. కాయలకోసం అంతా చేతులు చాపాం. కాని ఆపదలో ఎవరికి వాళ్ళమే వెనక్కి తగ్గాలని చూశాం. నామట్టుకు నేను ఇది నామీదికి రాకుండా ఉంటె బావుంటుందని అనుకోక పోలేదు. ముగ్గురమూ ధైర్యంగా అతనికి జవాబు చెప్పలేకపోయాం. కాయలు కొయ్యటానికి నేనెంత కారణమో మీరిద్దరూ కూడా అంతే గదా, ముగ్గురం కలిసి ఆకలిబాధకి ఓర్వలేక

కోశామంటే, పరిస్థితులు సరిగా చెప్పగలిగితే, ఆ కాయలు మనకి దక్కి ఉండవచ్చు. అలా కాకుండా ఎవరికి వాళ్ళం తప్పించుకోవాలని చూశాం. మన ఇద్దరి అసహాయ స్థితి చూసి ఇందాక శ్రామికుడు అన్యాయంగా మన దగ్గర నించి లాభం పొందాలని చూశాడు. కాని ఆ పరిస్థితిలో మనలో ఎవరం ఉన్నా అలాగే చేసేవాళ్ళమేమో ననిపిస్తోంది నాకు. స్వార్థం అంతగా మనలో కరుడుగట్టుకు పోయింది. "అవతలి వ్యక్తి దగ్గర్నించి మనం సాధ్యమైనంత ఎక్కువగా లాభం పొందాలి. మన దగ్గర్నించి అవతల వ్యక్తి సాధ్యమైనంత తక్కువగా లాభం పొందాలి! ఇదీ మనవారివాంఛ; మనసుల్లో అంతర్వాహినిగా ఉంటున్న కార్య కారణ సంబంధం నువ్వెంతో, నేనూ అంతే, నేనెంతో అతనూ అంతే. నువ్వూ, అతనూ, నేనూ అందరం పరిసమానులం, కష్టనష్టాలు సరిసమానంగా అనుభవిద్దాం అని మనం తికరణ శుద్ధిగా ఏనాడైతే అనుకుని ఆచరణలో పెడతామో ఆరోజునించే మనకు మంచి రోజులు పారంభిస్తాయని ఘంటాపథంగా చెప్పవచ్చు."

రైతూ, శ్రామికుడూ విన్నారు. "నిజం" అన్నారు.

"అయితే ఒక సందేహం" అన్నాడు రైతు.

"ఏమిటి?"

"మనముగ్గురం అట్లాగే ఉంటాం అనుకోండి. ప్రపంచం సంగతి?"

"మన ముగ్గురం ప్రపంచంలోని వ్యక్తులమే కదా. మనం మానవాతీతులం కాదు. నిజమే. కాని ప్రయత్నిస్తే మనుషులు మారటానికి ఎంతో కాలం పట్టదు. అది అలవికాని పని కాదు."

"అయితే ఏం చేద్దాం?" శ్రామికుడు అడిగాడు.

"ప్రచారం."

"ప్రచారం చెయ్యటానికి ఇదేమీ కొత్త సంగతి కాదుగా."

"నిజమే. కాని కళ్ళముందు కనపడేదాన్ని మనవాళ్లు చూడరు. చూసినా బద్ధకంతో కళ్లు మూసుకుంటారు. నిరాశతో, నిస్పృహతో అసాధ్యం అనుకుని ఊరుకుంటారు."

"అయితే మళ్లీ వెనక్కి పోదామంటారా?"

"అవును. ప్రచారం ప్రారంభిద్దాం."

"మనకి మైకులూ అవీ ఎవరిస్తారు?"

"మైకంటే గట్టిగా వినిపించేదేనా?"

"అవును."

"అయితే అదక్కర్లేదు. నేనరచినానంటే ఊరు మొత్తం మారు మోగాల. అయితే ఏమని అరవాలో నాకు తెలీదు."

"నేను చెబుతాగా" గుమాస్తా అన్నాడు.

"నేను గట్టిగా చెబితే మా రైతులు కాదనే వాళ్లు కాదు."

ముగ్గురూ లేచారు. దాదాపు అడవి చివర దాకా రావటంవల్ల ఆరాత్రి పక్క గ్రామంలో గడుపుదామని నిశ్చయించుకుని నడక సాగించారు. కొంత దూరంలో ఓ కారు కనిపించింది. దగ్గిరికి వొచ్చి చూస్తే అందులో మనుషులు ఎవరూ లేరు.

"గవర్నమెంటోళ్ళ బండల్లేవుంది" అన్నాడు శ్రామికుడు.

"ఎట్టా?" రైతు అడిగాడు.

"ఆ సింహాలూ, చక్రం గవర్నమెంటు ముద్రంటావా"

"ఈ కారు చెడిపోయింది. ఈ బండ రాయికి కారు కొట్టుకొంది." ముందునుంచి కారు పరీక్షిస్తూ గుమాస్తా అన్నాడు.

"మనదారిన మనం వెడదాం పదండి"

"బాగుపడుతుందేమో చూద్దాం. నాకు కారు విషయం కొంచెం తెలుసు. అయితే ఈ వంకరలు తియ్యాలి. చెయ్యి చేసుకుంటావా?" శ్రామికుణ్ణి చూస్తూ అన్నాడు గుమాస్తా. ఆ నిశీధిలో, నిశ్శబ్దంగా ఉన్న ఆ అడవిలో, సమ్మెట ధ్వనులు చెలరేగాయి.

కారు బాగుపడ్డది. డ్రైవింగ్ నేర్చుకున్న గుమాస్తా స్టీరింగ్ పట్టుకున్నాడు. మిగతా ఇద్దరూ ముందు సీటులో సర్దుకున్నారు. కారు స్టార్టయింది. మళ్ళీ వెనక్కి తమ పట్టణానికి ప్రయాణం అయారు ముగ్గురూ. కాయలు కోసిన చెట్టు వచ్చింది. కారు ఠపీమని ఆగింది.

"ఏం?" అడిగాడు రైతు.

"చాకు ఉందా?"

"ఊఁ, ఎందుకు?"

“ఓసారి ఇలా తే.”

రైతు చాకు అందించాడు. అతనికేమీ అర్థం కాలేదు. గుమాస్తా కారుదిగి ఆ చెట్టు బోదె మీద ఇలా రాశాడు.

“నేను = నువ్వు = అతను
ఇదే సూత్రం
విప్లవ తత్వం.”

“ఏమిటది?”

“చదువు.”

చదివాడు రైతు. శ్రామికుడికి చదివి వినిపించాడు.

“ఇది బోధివృక్షం” అన్నాడు గుమాస్తా. మళ్లీ కారు స్టార్టయింది.

* * *

“సింహాద్రీ, ఇదే ఆ అక్షరాల రహస్యం, అర్థం. రాగల సాంఘిక, ఆర్థిక విప్లవాల మూల సూత్రం ఈ మంత్రం.”

ప్రకాశవంతమైన సిద్ధుడి కళ్ళు చెమ్మగిల్లాయి. సింహాద్రి కాంతి ప్రసారంచేసే ఆ కళ్ల వైపు అలాగే చూస్తూ ఆలోచిస్తున్నాడు.

కథానిక

# పేర్ల ప్రణయ గాథ

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆ అమ్మాయి పేరు మోహనరావుకేమీ నచ్చలేదు. చిన్నప్పటినించీ అలాంటి పేర్లంటే అతనికి చాలా చికాకు. ఇంకా మూడేళ్ళు రోజూ నాలుగైదుసార్లు లెక్చరర్ అటెండెన్స్ తీసుకొంటూంటే ఈ పేరు వినాలనే భావం మోహనరావుకి చాలా బాధ కలిగించింది.

“రమణమ్మ!”

“ప్రెజెంట్ సర్” నీరసంగా, తియ్యని కంఠం.

ఈ మాటలు ప్రతి రోజూ వినడం ఎలాగునని ఆలోచిస్తూ ఆనాడే కాలేజీలో చేరిన మోహనరావు అటెండెన్స్ పలికిన అమ్మాయి వైపు చూచాడు.

తెలుపూ యెరుపూ కాకుండా చక్కని వర్ణంలో, తీర్చిదిద్దిన సౌష్ఠవయుతమైన అంగాల పొందికతో అందాలని చిందుతోన్నట్లు కనిపించింది ఆ అమ్మాయి మోహనరావుకి. నిజం చెప్పవలసివచ్చినా, రమణమ్మ చాలా అందగత్తెనని అంగీకరించక తప్పదు. కాలేజీ అబ్బాయిలకి అమ్మాయిల అందం గురించి మాటలాడుకోవడంలో తొందరా, అతిశయాలూ ఉన్న మోహనరావు దృష్టిలో రమణమ్మ చాలా న్యాయంగానే సుందరిగా కనిపించింది.

రెండు నిముషాలు తేరిపార చూచి మోహనరావు. సంతృప్తిగా చిరునవ్వు ఒకటి పారేశాడు ఎవరూ చూడకుండా మూడేళ్లు కొత్త కళ్ళకి నిండు ఉంటుందికదా అని. కాని ముల్లు గుచ్చుకున్నట్లు ఆ పేరు మళ్ళా జ్ఞాపకం వచ్చింది.

“రమణమ్మ”

కాలేజీలో చదువుకునే అమ్మాయిలు ఇలాంటి పేర్లతో ఉంటారని మోహనరావు అనుకోలేదు. ఆధునిక ప్రపంచంలో ఇన్ని వందల చక్కని నామధేయాలుండగా, ఈ పేరే దొరికిందా? ఏ పల్లెటూరిలోనో ఇల్లు తుడుచుకుంటూ, “నా పేరు - రమణమ్మ” అంటే బాగుంది కాని, లక్షణంగా కాలేజీలో చదువుకుంటూ ఈ పేరు ఏమిటి?

క్లాసు పూర్తయింది. అంతా వెళ్ళిపోతున్నారు. మోహనరావు అమ్మాయిల వెనకాల నడుస్తున్నాడు. వాళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు.

“ఏమే రమణీ-నీ సర్టిఫికేట్ వచ్చిందా?”

మోహనరావు గుండె ఝల్లుమంది...రమణి ...రమణి... ఎంత కటువుగా ఉంది! అయినా, వీళ్ళంతా ఎంత త్వరగా ఒకళ్ళకొకళ్లు స్నేహితులైపోయారు! ఉదయం నించీ తనొక్క-